# నిజమైన బంధం

**- డా. శీలానంద్**

అది విశాలమైన ఎయిర్ కండిషన్డ్ హాల్. బయటి వాతావరణం నుండి వచ్చిన వారిని సన్నగా చల్లబరుస్తుంది. హాల్‌లో అక్కడక్కడ అమర్చిన ఇండోర్ ప్లాంట్స్‌వల్ల హాస్పిటల్‌కు వచ్చినట్లుగా కాకుండా ఆహ్లాదకరంగా వుంది. లైట్ ఎల్లో కలర్ వాల్స్‌కు అక్కడక్కడ వాక్సినేషన్‌కు సంబంధించిన ఛార్ట్స్ పేషెంట్స్‌ని ఎడ్యుకేట్ చేయడానికి వ్రేలాడదీసి వున్నాయి. లైట్ క్రీమ్ కలర్ కర్టెన్స్ పైన లైట్ ఆష్ కలర్ డిజైన్‌తో హుందాగా గాలికి కదులుతున్నాయి.

హాలుకు కుడివైపు పీడియాట్రిక్స్ జనరల్ వార్డు బోర్డు వుంది. పెద్ద హాల్‌లాంటి ఆ గదిలో అయిదారు బెడ్స్ వరుసగా వున్నాయి. బెడ్స్ అన్నింటిపైన ఐదు నుండి పది సంవత్సరాల పిల్లలు రకరకాల జబ్బులతో చికిత్స పొందుతున్నారు. హాల్‌కు ఎడమవైపు వున్న గదికి డా.మానస అని బోర్డు వుంది. డ్యూటీ సిస్టర్స్ ఎవరి పనుల్లో వారు బిజీగా తిరుగుతున్నారు.

కాస్త ముందుకు వెళితే ఆపరేషన్ థియేటర్. దాని ప్రక్క సర్జికల్ వార్డు. మెట్లెక్కి పైకి వెళితే స్పెషల్ రూమ్స్. ధనికుల స్టేటస్‌కు తగినట్లుగా స్టార్ టీవీలు. ఒక మూలన వేజ్‌లో ఫ్రెష్‌గా అమర్చిన పూవులు. పేషెంట్స్‌కే కాకుండా వారితోపాటు వుంటున్న అటెండెంట్స్‌కు కూడా హోమ్లీగా, రిలాక్స్‌గా వున్నాయా గదులు.

డా.మానస రౌండ్స్ చేసి వచ్చి తన గదిలో కూర్చుంది. సన్నగా ఆకర్షణీయంగా వున్న అమ్మాయి టోకెన్స్ ఇచ్చి వచ్చిన వాళ్ల పేర్లు వ్రాసుకుని సీరియల్ నెంబర్ ప్రకారం పేషెంట్స్‌ను లోపలికి పంపుతోంది.

''మేడమ్! బెడ్ నెం.6 పేషెంట్ ఊపిరాడనట్టు రొప్పుతున్నాడు'' చెప్పింది సిస్టర్.

''అలాగా! వస్తున్నా పద'' గబగబా స్టెత్ తీసుకుని వెళ్లింది డా.మానస.

ఇంజెక్షన్ చేసి ఆ పేషెంట్‌కి ఇవ్వాల్సిన మందులు సిస్టర్‌కు ఆదేశించి తిరిగి వచ్చి తన సీట్లో కూర్చుంది.

ఉదయం నుండి థియేటర్‌లో ఆపరేషన్స్ చేయడంవల్ల బాగా అలసిట్లుగా వుంది ఆమెకి.

హాల్‌లో పాపను ఎత్తుకుని వసుధ, మోహన్ చాలాసేపటినుండి కూర్చుని వున్నారు.

''మేడమ్! ప్రొద్దుటి నుండి భార్యాభర్తలు ఒక పాపను తీసుకువచ్చి మీ కోసం వెయిట్ చేస్తున్నారు. మిమ్మల్ని ప్రత్యేకంగా కలవాలనుకుంటున్నారు'' చెప్పింది సిస్టర్.

''అలాగే పంపించు'' ఫ్లాస్క్‌లోని వేడి వేడి టీ కప్పులో వంపుకుని సిప్ చేస్తూ చెప్పింది.

''ఎక్స్‌క్యూజ్‌మీ మే ఐ కమిన్''

''ఎస్! కమిన్ ప్లీజ్''

రెండు సంవత్సరాల పాపని తీసుకుని లోపలకు వచ్చారు వచ్చారు వసుధ, మోహన్.

ఆ బోసినవ్వులు తొలకరి జల్లులా, వెన్నెల నవ్వులా ఆ పసిబుగ్గల నిగ్గులు పాలరాతి చలువలా, తనదైన లోకంలో నీలి కళ్లను తిప్పుతూ అందంగా వున్న ఆ పాపని నిశితంగా పరీక్షించింది.

చూస్తూనే గమనించింది పాప మెంటల్లీ రిటార్డెడ్ అని.

పాప తల్లి వసుధ కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. అయినా మాట్లాడడానికి ప్రయత్నించింది.

పరిస్థితి గమనించి మోహన్ అందుకున్నాడు.

''డెలివరీ ఎలా అయింది?'' అడిగింది డాక్టర్ మానస.

''డెలివరీ కష్టమయింది డాక్టర్. ఫిమ్‌టాలు వేసి పాపను బయటకి తీసారు. చాలాసేపటివరకు ఏడవలేదు. ఫిట్స్ వచ్చాయి. ఎనిమిది రోజులవరకు పాపని ఇంక్యుబేటర్‌లో పెట్టారు. బ్రతకడమే కష్టమన్నారు' చెప్పుకుంటూ పోతున్నాడు మోహన్.

పరిస్థితి అర్థమైనట్టు తల వూపింది డాక్టర్ మానస. డిఫికల్టీ ఫోర్‌సెప్స్‌వల్ల మెదడులోని రక్తనాళాలు చిట్లి శాశ్వతంగా మానసిక వైకల్యం వచ్చి అంగవైకల్యం ప్రాప్తించింది.

ప్రపంచంలో ఏ తల్లిదండ్రీ తట్టుకోలేని, భరించలేని చేదు నిజం ఇది.

పాపకి అన్నిరకాల టెస్టులు చేసింది మానస.

మోహన్‌ను ప్రక్కకు పిలిచి చెప్పింది ''పాప బాగుపడడానికి చాలా సంవత్సరాలు పడుతుంది. నా ప్రయత్నం నేను చేస్తాను.''

''తెలుసు డాక్టర్. కానీ ఇలాంటి బేబీ మాకు వద్దు. ఉయ్ నీడ్ ఎ హెల్దీ చైల్డ్. మా పాపని బాగు చేయమని మిమ్మల్ని అడగడంలేదు. మాకా ఆశ ఎలాగూ లేదు'' ఉద్వేగంతో చెప్పుకుపోతున్నాడు.

ప్రశ్నార్థకంగా చూసింది మానస వారివైపు.

''అలా అయితే పాపని ఏ అనాథ శరణాలయంలోనైనా వదిలేయండి''

''నో...డాక్టర్ నో. తల్లిదండ్రులుండి పాప అనాథగా పెరగడం మాకే భారమైన ఈ పాపను...'' ఆపైన గొంతు పలకలేదు అతనికి.

గుండెకు గండి పడినట్లుగా ఒక్కసారిగా రోదించసాగింది తల్లి.

శూన్యంలోకి చూస్తున్నట్లు నిలకడలేని చూపులతో పాప ఇదేమీ పట్టనట్లుగా పిచ్చిగా కేరింతలు కొడుతోంది.

''జీవితమంతా పాపని ఆ స్థితిలో చూసే ఆత్మస్థైర్యం, ఓపిక లేవు. అలా ఆడపిల్ల బ్రతికుండడంకంటే శాశ్వతంగా కన్ను మూయడమే మంచిది. ఆ దేవుడు మాకు ఇలాంటి పాపను ఇవ్వకపోయినా బాగుండేది. ప్లీజ్ పాపని చంపేయండి డాక్టర్. ప్లీజ్...చంపేయండి''

మోహన్‌వి చెమ్మగిల్లిన కళ్లు కావు. చెమ్మగిల్లిన గుండె తడి. విస్తుపోయి చూస్తూ వుండిపోయింది డాక్టర్ మానస. తనలో రగిలే భావ సంచలనాన్ని బయటకి వ్యక్తపరచలేదు. అది ఆమె మస్తిష్కంలో దృశ్యా దృశ్య సంఘర్షణ.

మౌనం లోతులు మాటల కందనట్లుగా నిశ్శబ్దంగా వుంది.

''సరేనని'' తలూపింది మానస.

★★★

పాపని తీసుకువచ్చి స్ట్రెచర్ పైన పడుకోబెట్టాడు మోహన్. హృదయంలో రగులుతున్న వేదనని లోపలనే అణుచుకోవడం వల్ల అతని కళ్లలో ఎర్రజీరలు దహించి వేస్తున్న దావానలంలా వున్నాయి.

వసుధ వణుకుతున్న చేతులతో బిడ్డను తడిమింది.

చివరిసారిగా ఈ క్షణంతో ఈ బిడ్డ మాకు దూరమైపోతుంది. ఆ పిల్ల ప్రాణాలు శాశ్వతంగా ఎటో పోతాయి. తన ఎదురుగా మాత్రం వేదన పడదు.

లావా ప్రవాహంలా తీవ్ర సంచలనమంతా ఆమె గుండెల్లోనే!

అసహనంగా, అలజడిగా, ఆందోళనగా వుంది ఆ

తల్లికి. బిడ్డకు శాశ్వతంగా వీడ్కోలు చెప్పడానికి. ఏదో చెప్పరాని బాధ దహించివేస్తోంది. కపటంలేని మనస్సు, మరపురాని మరచిపోలేని తన పాప నవ్వు...పదే పదే గుర్తుకురాగా కన్నీళ్ల పర్యంతం...వెక్కి వెక్కి ఏడుస్తోంది.

★★★

ఇంజెక్షన్ సిద్ధం చేసుకుని డాక్టర్ మానస స్పిరిట్‌తో క్లీన్‌చేసి ఇంజెక్షన్ ఇచ్చింది పాపకు. అది చర్మాన్ని కండరాల్ని చీలుస్తూ పోతుంటే ఆ పసిపాప కెవ్వున ఏడుస్తూ కొద్దిక్షణాల తరువాత మెలికలు తిరిగి కొట్టుకుంది.

ఆ దృశ్యాన్ని చూడలేక తల్లీదండ్రీ వెలుపలికి వచ్చేసారు.

కన్నీటి బిందువు పాషాణమైన వేళ, మానవత్వం మంట కలిసిన వేళ అచేతనంగా వుండిపోయింది పాప శరీరం.



★★★

మంచు మేలి ముసుగులో లోకం మీదకు సాగే ప్రణవనాదంలా ప్రభాత సుందరి. లాన్‌లో పచ్చల పతకంలా ఆకుపచ్చదనం, దానిపై రాత్రంతా కురిసిన మంచు ముత్యాల్లా మెరుస్తూ స్థిరంగా వున్న మంచు బిందువులు. రాత్రంతా నిద్రలేమివల్ల అంగారక కణాలుగా వున్న డా.మానస కళ్లను చల్లబరుస్తున్నట్లుగా వున్నాయి.

చల్లని జాబిలి కురిపించే వెన్నెలలా ఏ టెన్షన్ లేకుండా మృదువుగా చిరునవ్వుతో రిలాక్స్‌డ్‌గా మాట్లాడి ఎవరినైనా వప్పించగల తనదైన వ్యక్తిత్వం డాక్టర్ మానసది.

తనలో ఎన్నో ప్రశ్నలు. తనలో తలెత్తే ప్రశ్నలకి జవాబుగా ఒక స్థిరమైన నిర్ణయానికి వచ్చినట్టు గబగబా తయారై హాస్పిటల్‌కు వచ్చింది మానస. ముందుగా పాప వున్న గదిలోకి వెళ్లింది. పాప పల్స్ చూసింది. సిరెంజ్ లోడ్‌చేసి ఇంజక్ట్ చేసింది.

ఒక చర్య జీవితకాలపు ప్రశాంతత చేకూరిస్తే అంతకన్నా తృప్తి ఏమీ వుండదు? ఎవరికోసం ఆగని కాలచక్రంలో ఏళ్లు గడిచిపోతున్నాయి.

★★★

బయట మనో సెంటర్ ఫర్ స్పెషల్ చిల్డ్రన్ అని బోర్డు పెద్ద అక్షరాలతో ఆకర్షిస్తోంది. లోపల విశాలంగా వున్న హాల్లో రెండు నుండి పన్నెండు సంవత్సరాల వయస్సుగల సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతున్న చిన్నారులు సరిగ్గా కూర్చోలేక నడవలేక మాట్లాడలేకపోతున్నారు.

బుల్లి బుల్లి పాదాలతో నడవాల్సిన ఆ చిన్నారుల కళ్లలో పడిపోతామేమోనన్న భయం, వణుకు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పసివాళ్ల మెదడులోని కొన్ని భాగాలు చెడిపోవడంవల్ల మెదడు సక్రమంగా పని చేయక సెరిబ్రల్ పాల్సీ వ్యాధికి గురైన వారు వారంతా.

హాల్లో వరుసగా అమర్చిన కుర్చీలలో ఆ పసివాళ్ల తల్లిదండ్రులు కూర్చుని వున్నారు. వేదికపైన మనో సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మానస. ఇతర కమిటీ మెంబర్స్ ఆశీనులై వున్నారు.



మానవ జాతికి మిగిలిన ఒక విశ్వాసం ఆమె. దైవత్వాన్ని మించిన మానవత్వం ఆమెలో కనిపిస్తోంది. స్పాస్టిక్స్ (సెరిబ్రల్ పాల్సీ)తో బాధపడుతున్న చిన్నారులపై చిత్రీకరించిన స్లైడ్‌షోను అక్కడ ప్రదర్శిస్తున్నారు.

''ఈ చిన్నారులు వికలాంగులు కారనీ, చెప్పిన దానిని అర్థం చేసుకోగలుగుతారని, కానీ వెంటనే సమాధానమివ్వలేరని, నరాల్లో సమన్వయం లేకపోవడంవల్ల కొంత సమయం పడుతుంది కాబట్టి వారిని చేరదీసి అందరిలో తిరగేందుకు వీలుగా ఆ శిక్షణనిచ్చి తీర్చిదిద్దాలని'' చెప్పుకుపోతోంది డా.మానస.

సప్తవర్ణ కాంతి పుంజాలను ప్రసరింపజేసే నిర్మల స్ఫటికంలా మెరుస్తున్న ఆమె కళ్లు ఆ పసివాళ్ల జీవితాలకు వెలుగురేఖలు.

★★★

ఆదివారం సాయంత్రం డ్రాయింగ్ రూమ్‌లో లైట్‌పింక్ కలర్ కాటన్ చీర కట్టుకుని మెడికల్ పుస్తకాలు చదవడంలో లీనమైంది మానస.

మసకేయని చంద్రుని వెన్నెల చల్లదనాన్ని, ప్రకృతిలోని లాలిత్యాన్ని, లావణ్యాన్ని తనలో నింపుకున్నట్లుగా నిండుగా, హుందాగా, గంభీరమైన విగ్రహం ఆమెది.

కాలింగ్‌బెల్ మ్రోగడంతో పనిమనిషి వెళ్లి తలుపు తీసింది.

ఒక జంట పోర్టికోలో ఉన్నారు.


''డాక్టర్‌గారితో మాట్లాడాలండీ''


''ఆదివారం మేడమ్ ఎవ్వరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వరు. మీరు రేపు హాస్పిటల్‌లో కలవండి'' చెప్పింది పనిమనిషి. ఐదు నిముషాలు మాట్లాడి వెళతాం ప్లీజ్''

''కుదరదు. మేడమ్ రెస్టు తీసుకుంటున్నారు'' లోపలకి వచ్చింది పనిమనిషి.

''ఏమిటి రంగీ! ఎవరొచ్చారు?''

''మీతో అర్జంటుగా మాట్లాడాలట. ఈ రోజు




కుదరదని చెప్పాను.''

చదువుతున్న పుస్తకాన్ని మూసేస్తూ ''వారిని లోపలకు పంపించు''

''మేడమ్ రమ్మంటున్నారు'' చెప్పింది రంగి.

''కూర్చోండి'' సోఫా చూపించింది.

అతను సోఫాలో కూర్చున్నాడు. ఆమె సుడిగాలిలా వచ్చి మానస కాళ్లు చుట్టేసింది.

ఒక్క క్షణం కళ్లలోని నీళ్లు వరదలా పొంగిపోయాయి.

రెండు నిముషాల నిశ్శబ్దం తరువాత అతను గతాన్ని గుర్తు చేసుకుని చెప్పసాగాడు.

''ఐదు సంవత్సరాల క్రితం నిర్దాక్షిణ్యంగా నా పాపని నేనే పోగొట్టుకున్నాను''

రోదించసాగిందామె.

ఆమే వసుధ.

ముఖమంతా పీల్చినట్లుగా కళ్లలో కళాకాంతులు లేనట్టుగా జీవచ్ఛవంలా వుందామె.

''ఆ పాపమే మళ్లీ నాకు పిల్లలు పుట్టకుండా చేసింది'' వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

''అవును. అమ్మ అనే పదంలో ఎంతో పవిత్రత వుంది. ప్రతీ స్త్రీకి మాతృత్వం పొందడంలో ఎంతో ఆనందం, తృప్తి లభిస్తాయి. జీవిత పరమార్థానికి మాతృత్వం చాలా అవసరం. అప్పుడే ఆమెకు పరిపూర్ణత లభిస్తుంది. నవమాసాలు మోసి కన్నబిడ్డల ఆలానా పాలనలో స్త్రీకి ఎంతో ఆనందం. స్వార్థరహిత పరిపూర్ణరూపం మాతృదేవత. అలాంటి మాతృత్వానికి కళంకం తెచ్చిపెట్టాను. ఆ ఉసురేకొట్టింది.''

''లేదమ్మా లేదు. నీ పాప బ్రతికే వుంది. ఆ రోజు నేను మత్తు ఇంజక్షన్ మాత్రమే చేసాను'' మెల్లగా చెప్పింది మానస.

''డాక్టర్'' ఆమె వేసిన కేక రూములో ప్రతిధ్వనించింది. ఒక్క క్షణం సంభ్రమాశ్చర్యాలతో చూసారు దంపతులు మానసని. అది ఆనందం, ఆశ్చర్యం, ఆవేదన...ఎన్నో కలిగించిన భావ సంచలనం.

అనుభూతే తప్ప భాష్యం లేదు దానికి.

★★★

దిక్కు మొక్కు లేని మానసిక వికలాంగులను చేరదీసి ఆదరించే సంస్థ అది.

''పసివాడి ప్రాయంలోనే కుటుంబానికి, తల్లిదండ్రులకు దూరమై చిరుప్రాయపు చిలిపి చేష్టలకు దూరమై కల్లాకపటం తెలియని పసిడి జీవితం వారి బాల్యం.

అచ్చట ముచ్చటలతో ముద్దు మురిపాలతో కవ్వింతలు కేరింతలతో గడపాల్సిన బాల్యం ఛిద్రమైపోయి ఊహించేందుకే వీలుకాని ఆ చిన్నారులకు అది ఒక అమ్మ ఒడి. విద్యాబుద్ధులు నేర్పే గుడి.

ఒంట్లో నరాలు సమన్వయం లేకపోవడంవల్ల పడిపోతానేమోనన్న భయంతో అస్తవ్యస్తంగా అతి కష్టంమీద అడుగులు వేస్తోంది పాప.

''ఇన్ని సంవత్సరాల నిర్లిప్తత అనంతరం కలిగిన అనుభూతులో ఏమో సంతోషం, దుఃఖం ముప్పిరిగొన్న అంతర్మథనంవల్ల కలిగిన స్పందనో ఆమెను ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి చేసింది.

''పాపా...'' అంటూ చేయి చాపింది వసుధ.

అమ్...మ్...మ్...మ్మా''

అంటూ మానస దగ్గరకెళ్లి ఆమె చేతుల్లో వాలిపోయింది పాప.

ఆ అసలు తల్లి మానస చేతుల్లో వాలిపోయిన పాపని చూస్తూ వుండిపోయింది ఆశ్చర్యంగా.

ఒకరి కోసం ఒకరు కల్సి జీవించడానికి, ప్రేమ ఆప్యాయతలు ఆలంబన కావాలి. ఆ మమతానురాగ బంధమే బలహీనమైనట్టుగా చివుక్కుమన్న మనస్సుతో మెల్లగా గది నుండి బయటకి నిష్క్రమించింది వసుధ.

మానస పాపను గట్టిగా అక్కున చేర్చుకుంది.

★



## 'నంది' మీదా అనుమానమే!

కృష్ణవంశీ తీసిన 'సిందూరం' చిత్రానికి ఏడు నంది అవార్డులొచ్చాయి. కృష్ణవంశీ గొప్ప డైరెక్టర్. అది ఒప్పుకోవలసిన నిజం. అతని చిత్రం అవార్డులకు అర్హమైనదే! కాదనలేం. కానీ ఎందుకనో తెలీదుగానీ ఫిలింనగర్‌లో ఓ వార్త వినిపిస్తోంది. అదేంటంటే- 'తమ్మారెడ్డి భరద్వాజ అవార్డుల కమిటీలో మెంబర్ కావడం వల్లనే సిందూరం చిత్రానికి ఏడు అవార్డులొచ్చాయని. అవార్డుల కమిటీలో మెంబరైన భరద్వాజ మిగిలిన నలుగురు సభ్యులమీద వత్తిడి తెచ్చి కృష్ణవంశీకి అవార్డులపంట పండిస్తే ఆయనకు ఒరిగేదేమిటి? తమ్మారెడ్డి భరద్వాజ తదుపరి స్వంత సినిమా కృష్ణవంశీ దర్శకత్వంలోనే తయారు కాబోతోంది. ప్రేక్షకుల రివార్డ్లే కాదు, ప్రభుత్వ అవార్డులు వచ్చిన చిత్ర దర్శకుడి తదుపరి చిత్రాల మీద బిజినెస్ వర్గాల్లో కొన్ని ఎక్స్‌పెక్టేషన్స్ వుంటాయి. సో! తన చిత్ర దర్శకుడికి క్రేజ్ ఏర్పరచడం కోసం భరద్వాజ ఇలా చేశాడా? ఏమో! నిజం కమిటీ మెంబర్స్‌కే తెలియాలి.

-జె.వి.బాబు